

పులివెందులలో వందకోట్ల భూ కుంభకోణం : ఎమ్మెల్సీ

పులివెందుల రూరల్ : పులివెందుల మండలంలో భూ కుంభకోణాలకు అంతే లేకుండా పోయిందని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఏ విధంగా పనిచేస్తుందో పులివెందులను చూస్తే తెలుస్తుందన్నారు. రియల్ వ్యాపారులు, కొందరు ప్రభుత్వ అధికారులు, మరికొందరు పెద్దలు కలిసి 13 మంది రైతులకు నకిలీ ఎన్ఒసిలు తయారు చేసి ఇచ్చారని తెలిపారు. పులివెందుల మండలంలోని ఎర్రగుడిపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 135, అహోబిళపురంలోని సర్వే నెంబర్ 2, వెలమవారిపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 98,99,379,420,421,437,చిన్నరంగాపురంలో రెండు ఎకరాలతో పాటు మరి కొన్నిటికి నకిలీ ఎన్ఒసిలను తయారు చేసి ఇచ్చారని తెలిపారు. పేదల బంజరు భూముల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు .ముఖ్యమంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని విచారణ పారదర్శకంగా చేయాలని పేర్కొన్నారు.

సామాజిక అడవులకు కాసుల కష్టం



- రూ.30 లక్షల కేటాయింపునకు కత్తెర
- భారంగా మారిన నర్సరీల నిర్వహణ
- 5.45 లక్షల మొక్కలకు పరిమితం

సామాజిక అడవుల పెంపకం ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్లుగా సోషల్ ఫారెస్ట్ నిధుల కేటాయింపులకు కత్తెర పడింది. ఫలితంగా నర్సరీల నిర్వహణ మొదలుకుని మొక్కల పెంపకం, పంపిణీ ప్రక్రియ భారంగా మారింది. మొక్కల పెంపకం ద్వారా జిల్లాను సస్యశ్యామలంగా మార్చాలనే ఆశయం ప్రభుత్వ ప్రాధామ్యాల్లో కొట్టుకుపోతోంది. ప్రభుత్వం సోషల్ ఫారెస్టు నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో సామాజిక అడవుల పెంపకం సుడిగుండాలను ఎదుర్కొంటోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సామాజిక అడవుల పురోగతికి గ్రహణం పట్టింది. కడప సోషల్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలో తొమ్మిది నర్సరీలు ఉన్నాయి. ప్రతి ఏటా సుమారు ఎనిమిది లక్షల మొక్కలను పెంచి, ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా పంచాయతీల్లోని బంజరు, పడావు, ఇతర అనుబంధ భూముల్లో పెద్దఎత్తున మొక్కలను నాటడం పరిపాటి. ప్రభుత్వం ఏటా రూ.30 లక్షల చొప్పున నిధులు కేటాయించేది. రెండేళ్లుగా సోషల్ ఫారెస్ట్‌కు కేటాయింపులను నిలిపేసింది. నిధుల విడుదలకు సంబంధించిన బిల్లులను ఆన్ లైన్ చేయాల్సి రావడం, చెల్లింపులకు నెలల తరబడి సమయం తీసుకుంటున్న వైనం భారంగా మారింది. క్వార్టర్లీ నిధులను విడుదల చేసేది. ఫలితంగా నర్సరీల నిర్వహణకు అవకాశం లభించేది. ప్రభుత్వ ప్రాధామ్యాల నేపథ్యంలో నర్సరీ బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో నర్సరీల నిర్వహణలో రోజువారీ కూలీలకు నిధుల చెల్లింపుల సమస్య ఎదురవుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సోషల్‌ఫారెస్ట్ ఉపాధి హామీ నిధులపై దృష్టి సారించింది. ఉపాధి హామీ నిధులు వారం రోజుల వ్యవధిలో కూలీల ఖాతాల్లో జమ పడుతున్న నేపథ్యంలో నర్సరీల నిర్వహణ మొక్కుబడిగా సాగుతోంది.



5.45 లక్షల మొక్కలే!

నర్సరీల నిర్వహణకు నిధుల సమస్యం వెంటాడుతోంది. ప్రభుత్వం రెండేళ్ల కిందటి వరకు ఏటా సుమారు రూ.30 లక్షలు కేటాయింపులు చేయడం తెలిసిందే. రెండేళ్ల నుంచి ఒక్క పైసా నిధులు కేటాయింపులు చేయకపోవడంతో నర్సరీల నిర్వహణకు భారంగా మారింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సోషల్ ఫారెస్ట్ మొక్కల పెంపకాన్ని కత్తిరించింది. ఏటా సుమారు ఎనిమిది లక్షల మొక్కలను పెంపకం నుంచి 5.45 లక్షల మొక్కల పెంపకానికి పరిమితం చేసింది. ఫలితంగా జిల్లా పచ్చదనం పెంపకం తగ్గడంతో వాతావరణ కాలుష్యంపై తీవ్ర ప్రభావంపడే అవకాశం కనిపించే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

ఎర్రచందనం పెంపకం హుళక్కే!

ప్రతి ఏటా సోషల్ ఫారెస్ట్ పరిమితంగా ఎర్రచందనం మొక్కల పెంపకాన్ని చేపట్టేది. మార్చి, ఏప్రిల్ మాసాల నుంచి ఎర్రచందనం మొక్కల పెంపకంపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది. ఎర్రచందనం మొక్కల నర్సరీల నిర్వహణకు ప్రత్యేకంగా బెడ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రత్యేక బెడ్ల నిర్వహణకు మోస్తరుగా వ్యయం చేయాల్సి ఉంటుంది. మార్చి నుంచి ఆగస్టు నాటికి ఎర్ర చందనం మొక్కల పెంపకం కొలిక్కి వచ్చేది. ప్రభుత్వం రెండేళ్లుగా నిధులు విడుదల చేయని నేపథ్యంలో ఎర్రచందనం మొక్కల పెంపకానికి నిధుల సమస్య తలెత్తడంతో గాలికి వదిలేయడం ఆందోళన కలిగిస్తోంది.

అంగన్వాడీలపై నిర్బంధం

చలో విజయవాడను అడ్డుకుంటూ నోటీసులు అందజేత

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు ఈ నెల 25న విజయవాడలో నిర్వహించతలపెట్టిన ధర్నాను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్బంధానికి దిగింది. ఇందులో భాగంగా ప్రొద్దుటూరులో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఉప్పలపాటి ఉషారాణికి జమ్మలమడుగులో మండల అధ్యక్షులు లక్ష్మీదవేవి, కార్యదర్శి భాగ్యలక్ష్మి పోలీసులు మందుస్తుగా నోటీసులు అందజేశారు 25న అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఉండాలని, విజయవాడ దీక్షలకు వెళ్లినా, ఇతర కారణాలతో గైర్హాజరైనా చర్యలు తీసుకుంటామని పోలీసులు ఆ నోటీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేతనం పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, పెన్షన్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్‌వాడీలు పోరాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అన్ని జిల్లాల్లోనూ చలో కలెక్టరేట్ నిర్వహించామని అయినా,ః ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో విజయవాడలో ధర్నాచేపట్టాలని నిర్ణయించుకున్నారు. దీనిని అడ్డుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తల ఇళ్లకు పోలీసులు వెళ్లి నోటీసులు ఇవ్వడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడి న్యాయమైన కోరికలు తీర్చాలని కోరారు.

అంగన్వాడీల అరెస్టు ఖండిస్తున్నాం : సిపిఎం



పోలీసు ఇచ్చిన నోటీసు చూపుతున్న అంగన్వాడీ నాయకులు ఉషారాణి

కడప అర్బన్ : అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి 25న తలపెట్టిన ధర్నాను విఫలంచేయడానికి ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ధర్నాలో హింస జరుగు తుందనే తప్పుడు ప్రచారం పోలీసులు చేయడం గర్హనీయం. ఎక్కడికక్కడ ఇళ్ళవద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతినివ్వకపోవడం అప్రజాస్వామికమని తెలిపారు. అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యలకోసం గత కొంతకాలంగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నారు. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే.

'కొరటాల' జీవితం ఆదర్శనీయం

- జెవివి రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్
- రిమ్స్‌లో బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్



బాలింతకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది, జెవివి నాయకులు

సిపిఎం పోలిట్ బ్యూరో మాజీ సభ్యులు కొరటాల సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమని జెవివి రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ అన్నారు. ఆదివారం కొరటాల శత జయంతి సందర్భంగా జెవివి ఆధ్వర్యంలో రిమ్స్ బాలింతల వార్డులో బ్రెడ్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా రాజశేఖర్ రాహుల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొరటాల 1923, సెప్టెంబర్ 24న గంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో బుచ్చయ్య, వేషమ్మ దంపతులకు జన్మించారని తెలిపారు. పుట్టింది భూస్వామ్య కుటుంబంలోనైనా పెరిగింది ప్రజల మధ్య అన్నారు. మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతంపై అత్యంత విశ్వాసంతో ఉంటూ చివరి వరకు సిపిఎంలో పని చేశారని చెప్పారు. 1946-48 మధ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగుతున్న రోజుల్లో ఆంధ్ర ప్రాంతంలో దానికి మద్దతుగా నిలబడి జైలుపాలయ్యారని పేర్కొన్నారు. గంటూరు జిల్లాలో బంజరు భూములు, లంక భూముల కోసం పేదలను కదిలించి పోరాటాలు నిర్వహించారని తెలిపారు. వ్యవసాయ కూలీల వేతనాల పెంపు కోసం పోరాడారని చెప్పారు. 196 2లో మొదటిసారి వేమూరు నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా గెలిచారన్నారు. 1978లో రేపల్లె నుంచి శాసనసభకు ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా, పోరాటయోధుడిగా ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. కొరటాల శత జయంతి రోజు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు వెంకటేశ్వర్లు, షామీర్‌బాష, ప్రజాశక్తి సిబ్బంది సిద్ధయ్య, నారాయణ, నూర్‌బాష, బాలకృష్ణ, రాఘవులు, సుదర్శన్, రమ్యకృష్ణ, కె.జయ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు రుణాలు అందించడమే లక్ష్యం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు పెద్దపీట
- విద్యారంగ రుణాల మంజూరుకు ప్రాధాన్యత
- లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ ఎస్.దుర్గాప్రసాద్

జిల్లాలోని రైతులకు, ఔత్సాహితక పారిశ్రామికవేత్తలకు సకాలంలో రుణాలను అందిస్తాం. ఈమేరకు జిల్లాలోని బ్యాంకర్లకు అర్హులైన రైతులకు సకాలంలో రుణాలు అందించాలని ఆదేశాలు జారీ చేశాం. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన మేరకు నిధుల్ని అందిస్తాం. ఇందులో విద్యరంగ రుణాలు, ఎస్‌హెచ్‌జి రుణాలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రుణాల మంజూరు చేయడం మొదలుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆదరిస్తామని పేర్కొంటున్న లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎస్.దుర్గా ప్రసాద్‌తో ప్రజాశక్తి ముఖాముఖి...

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

వార్షిక ప్రణాళిక అమలు ఎలా ఉంది?

జిల్లా క్రెడిట్ అన్యువల్ ప్లాన్ అమలులో భాగంగా రూ.14, 924 కోట్లు వ్యాపారం చేయడమే లక్ష్యం. ఎస్‌ఎల్‌బిసి ఆదేశాల మేరకు బ్యాంకింగ్ వ్యవస్థ పని చేస్తోంది. ఇప్పటి వరకు రూ.7,867 కోట్లు మేర వ్యాపార కార్యకలాపాలు చేశాం. ఈలెక్కన సుమారు 55 శాతం మేర లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన ఆర్నెళ్ల వ్యవధిలో సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకోవడం జరుగుతుంది.

బ్యాంకుల వివరాలు తెలపండి?

జిల్లాలో 272 బ్యాంకులున్నాయి. ఇందులో ప్రధాన బ్యాంకులు వివరాలను పరిశీలిస్తే ఎస్‌బిఐ 59, యూనియన్ బ్యాంకులు 34, ఎపిజిబి 81, కెనరా బ్యాంకు 19, హెచ్‌డిఎఫ్‌సి 13, కో-ఆపరేటివ్ బ్యాంకులు 16, బరోడా బ్యాంకులు 06, బ్యాంక్ ఆఫ్ ఇండియా 04,కోటక్ 04, ఐసిఐసిఐ 04, ఆక్సిస్ 04 బ్యాంకులు ఉన్నాయి.

రైతు రుణాల మంజూరు అమలు ఎలా ఉంది?

2023-24లో రూ.6,675 కోట్లు కేటాయించడమైంది. ఇందులో ఇప్పటి వరకు రూ.2,967 కోట్లు మంజూరు చేశాం. ఖరీఫ్ సీజన్‌కు గానూ రూ.3,939 కోట్లు కేటాయించాం. ఇందులో రూ.2,967 కోట్లు మంజూరు చేశాం. ఖరీఫ్ సీజన్‌లో కరువు ప్రబలడంతో పూర్తిస్థాయిలో మంజూరు చేయలేకపోయాం. మిగిలిన రుణాల్ని రబీ సీజన్‌లోని రైతులకు రుణాలు అందించడంపై దృష్టి సారించాం.

వ్యవసాయ రుణాలు మంజూరు శాతమెంత?

ఖరీఫ్, రబీ సీజన్‌లకు రూ.9,565 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది.ఇందులోభాగంగా ఆగష్టు నాటికి రూ.5,763 కోట్లు మంజూరు చేయడమైంది. ఈలెక్కన 45 శాతం మంజూరు చేయడ మైంది. మిగిలిన 55 శాతం రుణాలను రబీ సీజన్ ముగింపు నాటికి మంజూరు చేస్తాం.

జగనన్నతోడు 7వ ఫేజ్ రుణాల మంజూరు ఎలా ఉంది?

జగనన్న తోడు 7వ విడత రుణాలు మంజూరు వేగంగా అమలవుతోంది. జిల్లావ్యాప్తంగా 11,579 మందికి రుణాలు ఇవ్వాల్సి ఉంది. ఇందులోభాగంగా ఇప్పటివరకు 7018 మందికి రుణాలు అందిం చగలిగాం. ఈలెక్కన 70 శాతం రుణాలు అందించాం. మిగిలిన 30 శాతం రుణాల్ని రాబోయే ఆర్నెళ్ల వ్యవధిలో అధిగమిస్తాం.

పిఎం స్వనిధి పథకం అమలుతీరు గురించి చెప్పండి?

జిల్లాలో 8,292 మందికి రుణాలను మంజూరు చేయాల్సి ఉంది. ఇందులో 6417 మందికి రుణాలు అందించగలిగాం. మిగి లిన రుణాలను సైతం సకాలంలో అందించడంపై దృష్టి సారించాం.

విద్యారంగ రుణాల అమలు తీరును వివరించండి?

విద్యారంగ రుణాల అమలు ప్రక్రియ వేగవంతంగా అమలవుతోంది. జిల్లావ్యాప్తంగా 1539 మందికి సుమారు రూ. ఏడు లక్షల నుంచి రూ.25 లక్షలు మేర మంజూరు చేయాల్సి ఉంది. ఇందులోభాగంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు మంజూరు చేయడమైంది.

ముద్రా రుణాలు మంజూరు గురించి చెప్పండి?

జిల్లావ్యాప్తంగా రూ.11,926 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది. ఈలెక్కన ఇప్పటివరకు రూ.171,22 కోట్లు కేటాయించడమైంది.

స్టాండప్ ఇండియా రుణాల వివరాలు తెలపండి?

స్టాండప్ ఇండియా పథకం ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలకు రుణాల మంజూరుకు 447 దరఖాస్తులు అందాయి. ఇందులో భాగంగా అర్హులైన 92 మందికి రుణాలు మంజూరు చేయడ మైంది.

వ్యవసాయ అనుబంధ రంగ రుణాలపై ఏమంటారు?

కిసాన్ క్రెడిట్‌కార్డు కింద వర్కింగ్ కేపిటల్ రుణాలు మంజూరు చేశాం. ప్రతి దరఖాస్తుదారునికి రూ.50 వేలకుపైగా అందజేశాం. పాడిరైతులకు 2000 మందికి రుణాల మంజూరు కింద రూ.15 కోట్లు, పిషరీస్ విభాగానికి రూ.150 రుణాలకు రూ.1.2 కోట్లు మంజూరు చేశాం.



సదస్సులో మాట్లాడుతున్న బొర్రా గోవర్ధన్

బుద్ధుని బోధనలే శరణ్యం

బుద్ధిస్ట్ తత్వవేత్త బొర్రా గోవర్ధన్


ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ప్రపంచానికి బుద్ధుని బోధనలే శరణ్యమని బుద్ధిస్ట్ తత్వవేత్త బొర్రా గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని మానసఇన్ లోని మినీ ఫంక్షన్ హాలులో ప్రాచీన భారతీయ తాత్వికపై సదస్సు నిర్వహించిన సదస్సు కుమార్ రెడ్డి అద్యక్షతన వహించారు. ఈసందర్భంగా బొర్రా గోవర్ధన్ మాట్లాడుతూ కడప గడపలో భారతీయ తాత్వికపై మొదటి సదస్సు నిర్వహించిన నాయకత్వానికి అభినందనలు తెలిపారు. దయ, జాలి, కరుణ సమ్మేళనమే బౌద్ధమని తెలిపారు. ప్రత్యక్ష ప్రమాణం ద్వారానే ప్రమాణాలుగా తీసుకున్న వారు బుద్ధుడు, కారల్ మార్క్స మాత్రమేనన్నారు. ఆత్మలపై మార్క్స మాత్రమే యుద్ధం చేశారని తెలిపారు. కులవాద రక్కసికి ప్రతివాదిగా బుద్ధుడు పుట్టాడన్నారు. బుద్ధుడి బోధనల్ని శ్రీలంకలోని ఇలు భాషలో రాశారని తెలిపారు. కుల నిర్మూలనకు ప్రత్యామ్నాయమే బౌద్ధమని చెప్పారు. అంతకు ముందు చిన్నపరెడ్డి మాట్లాడుతూ మానవ జాతి పురోగతి సమస్తం సంఘర్షణలమయమన్నారు. తాత్విక చింతన సాధనకు బుద్ధిస్ట్ లో ప్రయాణించడం ద్వారానే అవగతమవుతుంది. డాక్టర్ రాజా వెంగల్ రెడ్డి మాట్లాడుతూ భౌతిక వాద ధోరణుల ప్రస్తావనే నేరమయమైందని చెప్పారు భౌతిక వాదులు దేవీచటోపాధ్యాయకు రుణపడి ఉంటారని తెలిపారు. కోవిడ్ భావ, భ్రమవాదనల్ని పెంచి పోషించిందని వాపోయారు. ప్రముఖ రచయిత దాదా హయత్ మాట్లాడుతూ మొహెంజదారో మొసఫొటేషియా నాగరికతలు, సింధూ నాగరికత బయటపడడంతో బ్రిటీషర్లు వాదన వెలతెలా పోయిందన్నారు. సింధూ నాగరికతలో ఎద్దు సింబాలిక్, ఆర్య నాగరికతలో ఆవు, గుర్రం సింబాలిక్ గా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, అడ్వకేట్ సంపత్‌కుమార్, హేతువాద సంఘం నాయకులు సిఆర్‌వి ప్రసాద్, ఆర్‌సిపి రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి బుద్ధిస్టునాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి దీక్షకు న్యాయవాదుల సంఘీభావం

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి అధినేత అక్రమ అరెస్టును నిరసిస్తూ 'బాబు'తో నేను' నినాదంతో చేపట్టిన రిలే నిరాహారదీక్షకు న్యాయవాదులు మద్దతు తెలిపారు. ఆదివారం వారు శారదనిలయం సమీపంలో నిర్వహిస్తున్న దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మాధవిరెడ్డి మాట్లాడుతూ 'బాబు' నిర్దోశిగా విడుదల కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, నగర అధ్యక్షులు శివకొండారెడ్డి, పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మాసా కోదండరామ్ పాల్గొన్నారు.



టిడిపి దీక్షలకు సంఘీభావం తెల్పుతున్న న్యాయవాదులు



సెంట్రల్ జైలు నుంచి విడుదలై బయటకు వస్తున్న టిడిపి కార్యకర్తలు

అంగళ్లు కేసులో అరెస్టయిన టిడిపి కార్యకర్తలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న పుంగనూరు, అంగళ్ల అల్లర్ల కేసులో అరెస్టు అయిన 52 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు ఆదివారం కడప సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. 60 రోజుల పాటు జైలు శిక్షణ అనుభవించారు. వారికి టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, షాజహన్‌బాష స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గొడవల్లో తమ ప్రమేయం లేకపోయినా వైసిపి ప్రభుత్వం అన్యాయంగా కేసులు పెట్టి అరెస్టు చేయించిందని వాపోయారు. టిడిపి నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు పెట్టడమే వైసిపి ప్రధాన కర్తవ్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. పెద్ద నాయకులు పార్టీని వీడిపోయినా కార్యకర్తలు పార్టీని కాపాడుకుంటూ ఉన్నారని తెలిపారు. పార్టీలో కష్టపడేవారిపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. అల్లర్ల ఘటనలో ఉన్నారా..లేరా అని విచారణ కూడా చేయకుండా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి కక్షపూరితంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకో పాలనకు ప్రజలకు చరమ గీతం పాడి, టిడిపికి పట్టకడుతారని వారు ధీమా వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిటీ నామమాత్రంగా నియమించారని పేర్కొన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించలేదని చెప్పారు. 12వ పిఆర్‌సి ఆలస్యమవుతుంది కాబట్టి ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్ డిఎలు చెల్లించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సంపాదిత సెలవులు నగదు రూపేణ తీసుకోవడానికి పెట్టిన బిల్లులు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పిఎఫ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్‌గ్రెడేషన్ పోస్టుల్లోకి బదిలీల ద్వారా వెళ్లిన ఉపాధ్యాయులకు ఆ పాఠశాలలకు మ్యాపింగ్ కాని కారణంగా జూన్ నుంచి ఇంతవరకు జీతాలు అందలేదని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలన్ని ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, రంగరాజు, కార్యదర్శులు గంగాధర్, జయరాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు

కడప అర్బన్ : నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి యువత పోరాటాలకు సిద్ధం కావాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు పిలుపు నిచ్చారు. ఆదివారం శంకరాపురంలో స్థానిక కమిటీ సమావేశం ఉపాధ్యక్షులు విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ 4 సంవత్సరాల వైసిపి పాలనలో ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ లేదని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ హామీగా అటకెక్కిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో స్థానిక నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోపి, కార్యదర్శిగా జగదీష్, సభ్యులుగా దివాకర్, సాయి, అభిరామ్, భరత్‌ను ఎన్నుకున్నారు. పరిశీలకులుగా నగర కార్యదర్శి ఓబులేసు, ఉపాధ్యక్షులు విజయ్ వ్యవహరించారు.

5 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎసిఎ అండర్ - 23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఇందులో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదనాంలో నిర్వహించిన ప్రారంభ మ్యాచ్‌లో విజయనగరం జట్టుపై 5 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 28.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. ఆ జట్టులోని దుర్గాకుమార్ 40 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని ఎం.డి. సాహిల్ హుస్సేన్ 2, పి. వంశీ నారాయణ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 137 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 27.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని ఏ.వి.వి. విజయ్ 52, ఎస్. రాహుల్ 40 పరుగులు చేశారు. విజయనగరం జట్టులోని దుర్గా ప్రశాంత్ 3, రవి కిరణ్ 2 వికెట్లు తీసుకున్నారు.

రెండు వికెట్ల తేడాతో విజయం సాధించిన నెల్లూరు జట్టు...

వైఎస్ రాజారెడ్డి ఏ సి ఏ స్టేడియంలో జరిగిన వేరొక మ్యాచ్ లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టుపై 2 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 40.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. ఆ జట్టులోని ధరణి కుమార్ నాయుడు 62 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సాకేత్ రామ్ 3, అఖిల్ సాలుంకే 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 217 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు 39.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసి 2 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని పి. సుబ్రహ్మణ్యం 60, పి. రోషన్ పవన్ కుమార్ 40 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని సంతోష్ కుమార్ 4, మల్లికార్జున 2 వికెట్లు తీసుకున్నారు.

జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా అటవీ శాఖ అధికారి పి.వి. సందీప్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంస్థల సహకారంతో ఆదివారం స్థానిక గ్రాండ్ ఇన్‌హోటల్ సమావేశ మందిరంలో ఎకో టూరిజంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పి.వి. సందీప్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 37 శాతానికి పైగా అటవీ ప్రాంతాలున్నాయని అందులోని పలు ప్రాంతాలను ఎకో టూరిజం కింద అభివద్ధి చేసుకోవచ్చన్నారు. అలాంటి ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఇబ్బందిగా మారిందని పర్యావరణ పరిరక్షణకు జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ అధికారులు చేస్తున్న కృషి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతైనా అవసరమన్నారు. ప్రొద్దుటూరులో పచ్చదనం అభివద్ధికి అక్కడి డాక్టర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ విషయంగా కలిసి వచ్చేందుకు సిద్ధమైన రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, ఇంటాక్, లయన్స్ క్లబ్ సంస్థల ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ మానస లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ నాడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, నేడు ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా పర్యాటక అభివద్ధి చేస్తున్న కృషికి సహకారం అందివ్వడం మన బాధ్యత అన్నారు. ఇందులో పుష్పగిరి, పాలకొండలు, గువ్వల చెరువు, తదితర అటవీ ప్రాంతాలను ఎకో టూరిజం క్రింద అభివద్ధి చేసుకోవచ్చని తెలిపారు. జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ఇంజనీర్ దేసు వెంకట రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటకంగా అభివద్ధి చేయడంలో స్వచ్ఛంద సంస్థలు కలిసి రావడం అభినందనీయం అన్నారు.



సింహాద్రిపురం-గురిజాల రోడ్డులో నిలిచిన నీరు

చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

చిన్నపాటి వర్షానికే మండల కేంద్రమైన సింహాద్రిపురం జలమయమవుతోంది. చినుకు పడితే రోడ్డుకి ఇరువైపులా నీరు నిలుస్తోంది. రోడ్డుపై నడవాలంటే ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల అభివృద్ధి పనుల్లో భాగంగా అండర్ డ్రయినేజీ, వాటర్ గ్రిడ్ పనులు చేయడంతో రోడ్డు అటు వైపు, ఇటు వైపు ఎత్తు పెరిగింది. ఈ కారణంగా నీరు రోడ్డులో నిలుస్తోంది. అధికారులు స్పందించి నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థానంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రీజినల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూరే చెంచయ్య మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కార్యక్రమం నిర్వహించారన్నారు. ప్రజలు, విద్యార్థులకు పలు సేవలు చేసిన ఆరవేటి నాగేంద్రను సన్మానించడం గొప్ప విషయమన్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అనుముల వేణుగోపాల శెట్టి, బచ్చు సత్యనారాయణ, ఈపూరి సత్యనారాయణ, పేర్ల శేషయ్య, దేవతి రాము, కొప్పోలు కిషోర్, మహిళా మండలి ఆర్యవైశ్య సంఘ పెద్దలు, వాసవి క్లబ్ సభ్యులు, దేవతి, ఉపేంద్ర పాల్గొన్నారు

మానవత్వంతో రక్తదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న మధు అనే వ్యక్తికి 'ఒ' పాజిటివ్ రక్తం అవసరం కాగా.. అతని బంధువులు పట్టణంలోని డొక్కా సీతమ్మ అన్నదాన, రక్తదాన సేవా సంస్థ పర్యవేక్షకుడు గంజి సురేష్‌కుమార్‌ను సంప్రదించారు. ఈ విషయాన్ని ప్రొద్దుటూరు మీడియా గ్రూప్స్‌లో తెలియజేవారు. ఇందుకు స్పందించిన టి.హర్షవర్ధన్ అనే యువకుడు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. అనంతరం వారు సేవా సంస్థకు, రక్తదాత హర్షవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - చాపాడు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ కూర్చున్నారు. ఆయనతోపాటు మైదుకూరు నియోజకవర్గ తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు. పొలిమేర మహేంద్ర, ముడియం ప్రసాద్, రాకెట్ రఫీ, నూర్, కిరణ్, ప్రభాకర్, రమేష్ నాయుడు, ఇమ్రాన్‌బాషా, సీనియర్ టిడిపి నాయకులు పుట్టా ప్రభాకర్, కటారి కృష్ణ, ఆకుల కృష్ణయ్య, రామచంద్ర నాయుడు, అన్నవరం సుధాకర్‌రెడ్డి, మిల్లు శీను, సలీమ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, మేకల బాబు, రమణ, సబ్బరాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 13వ రోజు ఆదివారం కూడా నిరసనలు కొనసాగాయి. గోపవరం పంచాయతీ టిడిపి నాయకులు పట్నం మాబాషా, గగ్గుటూరు గఫార్ బాషా, బాల పుల్లయ్య, గిద్దలూరు సుబ్రహ్మణ్య ఆచారి దీక్షలో కూర్చున్నారు. వీరికి మద్దతుగా ప్రొద్దుటూరు మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్, 14వ వార్డు మస్తాన్ గోలే, వెంకటకృష్ణ యాదవ్, దేవాంగ కమిటీ అంపావతి నాగ సుబ్బరాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆదివారం పలువురు ఆ పార్టీ నేతలు కూర్చున్నారు. టిడిపి రాష్ట్ర నాయకుడు సిఎం సురేష్‌నాయుడు నేతృత్వంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష పదవ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, మాజీ ఎంపిపి శెట్టిపల్లి ప్రభాకరరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కె.ఖలీల్ బాషా, నిజాం, జగదీష్, టి.సయ్యన్న, మహబూబ్ బాషా, సలీం, కె.దేవిలలిత, నానీ, గౌస్య, షర్మిల, జుబేదా యాసిన్, మెహతాజ్, సజూరిన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేలం పాటకు విశేష స్పందన



వేలం పాటలో పాల్గొన్న దాతలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ వివేకానంద కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ స్వామికి, వివిధ రకాల ప్రసాదాల వేలంలో రూ.7.74లక్షలు దక్కించుకున్నారు. శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ నిర్వహించిన స్వామివారి వేలం పాటలో వినాయకుడి లడ్డూను గంటేనా శివ రూ.1,21,000కు దక్కించుకున్నారు. వెండి కాయిన్ రామన బోయిన వెంకట సుబ్బయ్య యాదవ్ రూ.1,41,000కు వేలంలో దక్కించుకున్నారు. స్వామివారి మెడలోని నోట్లమాలను రూ.2,52,000కు కావేటి బాలయ్య యాదవ్ అత్యధికంగా వేలంలో దక్కించుకున్నారు. స్వామివారి దగ్గర ఉంచిన పెన్ను, పుస్తకాన్ని గొర్ల వరలక్ష్మి యాదవ్ రూ.1,40,000కు వేలంలో పాడారు. స్వామి వారి దగ్గర ఉన్న కలశం చెంబును కోళ్ల నరేష్ యాదవ్ రూ.1,20,000కు దక్కించుకున్నారు. శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా వేలం జరగడం విశేషం. ఈ వేలంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పూజలనంతరం స్వామిని తరలిస్తున్న అర్చకులు

ఘనంగా ఆలయ పునరుద్ధరణ శంకుస్థాపన

చాపాడు : జిల్లాలో ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని పెద్ద చియ్యపాడు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఆదివారం బాలలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శ నాచా ర్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలనంతరం స్వామి వారి విగ్రహాన్ని బాల లయంలో ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణా నికి దేవదాయ శాఖ ద్వారా రూ.61 లక్షల నిధులు మంజూరైన విషయం తెలిసిందే. అక్టోబర్ నెలలో నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేయ నున్నట్లు ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఇఒ రమణ, స్థానికులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనంలోనే బోధన

తాత్కాలిక భవనంలో వసతుల కొరత.. నిధుల ఆలస్యంతో ఆగిన పనులు



నిధులలేమితో మధ్యలో నిర్మాణం ఆగిన పాఠశాల భవనం

ప్రజాశక్తి - పెద్దముడియం

మండల కేంద్రంలోని పెద్దముడియంలో దశాబ్దాల నాటి పాఠశాల భవనంలో పై పెచ్చులు ఊడి, చప్పట కుంగి, భవనం శిథిలావస్థకు చేరింది. పాత పాఠశాల భవనాన్ని కూల్చేసి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎనిమిది గదులుగా పాఠశాల భవన నిర్మాణం చేపట్టారు. ఈ పనులను కొన్ని నెలల క్రితం ప్రారంభించారు. అయితే ఈ భవనం నిధుల కొరతతో స్లాబులు వరకు వచ్చి ఆగిపోయింది. ఈ దశలో విద్యార్థుల బోధనకు తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేశారు. అందులో కనీస సౌకర్యాల్లేవు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతుండడంతో వారి అవస్థలను గుర్తించిన పాఠశాల ప్రధానోపా ధ్యాయులు నాగిరెడ్డి నిర్మాణంలో ఉన్న భవనం లోనుండే విద్యార్థులకు తమ సిబ్బందితో ఇబ్బందుల మధ్య విద్యను బోధిస్తున్నారు. నిధుల ఆలస్యంతో భవన నిర్మాణం నిలుపుదల కాగా.. విద్యార్థులు మట్టిలో అలాగే స్కూలు నిర్మాణ పనుల నిమిత్తం సిమెంట్ బస్తాలను సమకూర్చుకున్న గదిలోనే కూర్చుని అసౌకర్యంగానే పాఠాలు వింటున్నారు. వర్షం పడితే అన్ని తరగతి గదుల్లో నీరు చేరుతుంది. తడి నేలపైనే విద్యార్థులు చదువుకుంటున్నారు. నేలపైన కూర్చోవడంతో చీమల తోనూ, పురుగులతోనూ విద్యార్థులు అవస్థలుపడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నూతన పాఠశాల భవనాల నిర్మాణాలను మళ్లీ ప్రారంభించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభం

నిధుల కొరతతో కొంతకాలంగా పాఠశాల పనులు ఆగినమాట నిజమే. తాత్కాలిక భవనంలో కనీస సౌకర్యాలు లేక సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో నిర్మాణంలో ఉన్న భవనంలోనే విద్యను బోధిస్తున్నాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. త్వరలో పూర్తి చేసి నూతన తరగతి గదుల్లోకి విద్యార్థులను మార్చుతాం.

- నాగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు



సిమెంటు బస్తాలున్న గదిలోనే పాఠాలు వింటున్న విద్యార్థులు

కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటాం



ఎంపీని కలిసిన మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిసార్ బాషా

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోని టిటిడి కళ్యాణ మండపంలో బూత్ కన్వీనర్లులకు, బూత్ కమిటీ సభ్యులకు, వార్డు, ఎంపిటిసి సభ్యులకు ప్రజాదర్బార్‌ను ఎంపీ ప్రారంభించారు. ప్రజా దర్బార్‌లో కార్యకర్తలు ఇచ్చిన దరఖాస్తులను తీసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను ఆదుకొని, వారి సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో కూడా పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల ఆరోపణలను తిప్పి కొట్టాలని కోరారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగితాల్లోనే ప్లాస్టిక్ నిషేధం..!

టాస్క్‌ఫోర్స్ పేరిట హడావుడి.. ఆచరణలో అంతంత మాత్రమే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్ కవర్లు, ఒక్కసారి వాడే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను గత ఏడాది నుండి కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఆదేశించింది. కాగా జమ్మలమడుగు పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం కాగితాలల్లోనే కనిపిస్తుంది. అమలు పకడ్బందీగా జరుగుతోందని అధికారులు చెబుతున్నప్పటికీ, బహిరంగంగా మున్సిపల్ అధికారుల ఎదుటే విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదు. పట్టణంలోని ప్రధాన వాణిజ్య కూడలల్లో ప్లాస్టిక్ అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. గతేడాది టాస్క్‌ఫోర్స్ పేరుతో హడావుడి చేసిన అధికారులు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అపరాధ రుసుం విధించారు. తర్వాత పర్యవేక్షణను గాలికి వదిలేశారు. మరోవైపు ప్రజా ఆరోగ్య, పారిశుధ్య విభాగం సిబ్బంది ఎక్కడైనా ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే ఆయా దుకాణాదారులు వ్యాపారులకు లోపాయికారికంగా సహకరిస్తూ అందిన కాడికి దండుకుని జేబులు నింపుకొని వదిలేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పేరిట ఏర్పాటు చేసిన బృందం అపరాధ రుసుంగా వసూలు చేసిన మొత్తం మున్సిపాలిటీ ఖజానాకు ఎంత జమ చేశారనే వివరాలు ప్రజలకు ఇంతవరకు తెలపడం లేదు. ఇప్పటికీ నిషేధిత పాలిథీన్ కవర్లు తోపుడుబండ్లపై, హోటళ్లు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు వద్ద, పాలు, పెరుగు విక్రయ దుకాణాల్లో కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల 121 మైక్రానుల కంటే ఎక్కువ మందం ఉన్నట్లు ముద్రించిన కవర్లు కనిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పకడ్బందీగా చర్యలు తీసుకోకుంటే నిషేధిత లక్ష్యాలు నీరు గారుతుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్లాస్టిక్ కవర్లలో తీసుకెళుతున్న కూరగాయలు



రహదారులపై వాడిపడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

విచ్చలవిడి వినియోగం : జమ్మలమడుగు పట్టణంలో ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కొబ్బరిబొండాల దుకాణాల వద్ద పల్చని ప్లాస్టిక్ బాటిళ్లు, కొన్ని హోటళ్లల్లో అల్పాహారం స్టాల్స్ వద్ద ప్లాస్టిక్ స్పూన్లు, పోర్కులు, గ్లాసులు వాడుతున్నారు. మార్కెట్లోని పలు దుకాణాలలో వీటిని అమ్ముతుండడంతో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. నిషేధిత వస్తువులు విక్రయించే దుకాణాలపై అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదనే విమర్శలున్నాయి. ప్రజా ఆరోగ్య విభాగానికి సిబ్బంది ప్రస్తుతం భారీగా ఉన్నందున ఒకటి, రెండు నెలలు కాకుండా నిబంధనలు అమలు పక్కాగా చేపట్టాల్సిన అవసరం ఉంది. వార్డు సచివాలయంలో పర్యావరణ కార్యదర్శులు అందుబాటులో ఉన్నారు. మీరు కాకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్వైజర్లు పక్కాగా దృష్టి సారించి నిబంధనలు, అమలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ప్లాస్టిక్ నిషేధం ఏమంత కష్టం కాదని కొన్ని పట్టణ పురపాలక సం స్థలలో ఇప్పటికే నిరూపించిన విషయం తెలిసిందే.

కఠిన చర్యలు లేకపోవడంతోనే : ప్రత్యేక సందర్భాల్లో రకరకాల కార్యక్రమాలతో హడావుడి చేసే అధికారులు, ప్రజాప్రతినిధులు మామూలు రోజులలో పర్యావరణ పరిరక్షణపై గట్టి దృష్టి సారించడం లేదు. పట్టణంలోని మెయిన్ బజార్, తాడపత్రి రోడ్డు, ముద్దనూరు రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, మార్కెట్ రోడ్డు వంటి ప్రధాన కూడళ్లల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఎక్కువగా కనిపిస్తుంది. సింగిల్ యూజ్ బాటిళ్లు విక్రయించే దుకాణాలు పట్టణంలో చాలా ఉన్నాయి. వీటి అన్నిటిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.

ప్యాక్ హౌస్ బిల్లుల కోసం రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ప్యాక్ హౌస్ బిల్లుల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. ఉద్యాన సమగ్రాబివృద్ధి పథకం కింద ప్రభుత్వం 50 శాతం రాయితీతో నిర్మాణాలు చేపట్టి రైతులకు ప్రోత్సాహం ఇస్తోంది. ఇందులో పూర్తి చేసిన నిర్మాణాలకు పూర్తి వాటా నాలుగు లక్షలు కాగా ప్రభుత్వం రెండు లక్షలు రైతులకు రాయితీ ఇవ్వాల్సి ఉంది. ఈ రాయితీ కోసం రైతులు దాదాపు ఆరు నెలల నుంచి వేచి చూస్తున్నారు. ప్రభుత్వం ఎంతో మంచి ఆశయంతో రైతుల పొలాల వద్ద పండించిన పంటల దిగుబడిని శుభ్రపరచడంతోపాటు గ్రేడింగ్ చేసే అవకాశం ఉంది. అలాగే రైతులు తమ దిగుబడులను తాత్కాలికంగా నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ప్యాక్‌హౌస్ నిర్మించినా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ముద్దనూరు ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వరరెడ్డిని అడగ్గా.. ఆరు నెలల నుంచి బిల్లులు రావడంలేదన్నారు. త్వరలోనే రాయితీ సొమ్ము వచ్చే అవకాశం ఉందన్నారు.



అగ్రహారంలో నిర్మించిన ప్యాక్‌హౌస్

ప్రధాన రహదారిలో కంపచెట్లు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై రోడ్డుకిరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. నెల్లూరు-బళ్లారి హైవే రోడ్డు కావడంతో నిత్యం వాహనాలు రద్దీగా రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన సూచిక లైన్ వరకు కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో ఒకేసారి రెండు వాహనాలు సమాంతరంగా ప్రయాణించే సమయంలో కంపచెట్లు తగులుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు సమస్యలు తలెత్తుతున్నవి. కుందూ నది సమీపంలో అధికంగా కంపచెట్లు ఉన్నాయి. రాత్రి సమయాల్లో భయాందోళనకు గురికావాల్సి వస్తుందని వాహనదారులు పేర్కొంటున్నారు. ముందువెళుతున్న వాహనాన్ని దాటే (క్రాస్) సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మధ్య భాగంలో ఉన్న డివైడర్‌పై కూడా పిచ్చి మొక్కలు ఉన్నాయి. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కుందూ నది సమీపంలో రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు



చిరుతపులి సంచరించిన ఆనవాళ్ల పరిశీలనలో అటవీ అధికారులు

ఇడుపులపాయ అడవుల్లో చిరుత సంచారం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి సమీపంలో శనివారం రాత్రి చిరుతపులి సంచరించి వెళ్లినట్లు హరిత రెస్టారెంట్ సిబ్బంది ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. స్పందించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాల సుబ్రమణ్యం తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలం వద్దకు వెళ్లి చిరుతపులి తిరిగిన ఆనవాళ్లపై ఆరా తీశారు. చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి ట్రిపుల్ ఐటిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు సూచనలిచ్చారు. రాత్రి సమయంలో డ్యూటీ చేస్తున్న సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని కోరారు. సమీపంలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని బాలసుబ్రమణ్యం సూచించారు. ఇడుపులపాయ ప్రాంతంలో దట్టమైన శేషాచల అడవులు ఉండడంతో అడవి జంతువులు అప్పుడప్పుడు కనపడేవి. ప్రస్తుతం చిరుతపులి కనపడడంతో ఆ ప్రాంతంలోని ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

రాజధాని తరలింపు రాయలసీమకు తీరని ద్రోహం

పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నుండి విశాఖకు తరలిస్తే రాయలసీమ ప్రజలకు తీరని నష్టంతోపాటు ద్రోహం చేసిన వారుగా వైసిపి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రజలకు శాశ్వత నష్టం, అన్యాయం జరుగుతుందన్నారు. రాయలసీమ ప్రజలు రాజధాని అమరావతికి పోవాలంటే దాదాపు 10 గంటలు పడుతుంది.. అదే విశాఖకు పోవాలంటే మరో 10 గంటలు అదనంగా పడుతుందని చెప్పారు. అనేక వ్యయ ప్రాయాసాలకు గురికావాల్సి వస్తుందన్నారు. అమరావతి రాష్ట్రానికి నడి బొడ్డున ఉందన్నారు. అన్ని ప్రాంతాల వారికి సౌకర్యంగా ఉందని తెలిపారు. సచివాలయ భవనాలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. దాదాపు రూ.10 వేల కోట్లు ప్రజాధనం ఖర్చు చేశారన్నారు. ఈ నేపథ్యంలో రాజధాని మార్పు నిర్ణయం సరికాదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాయల సీమ వాసిగా ఉంటూ రాయలసీమ ప్రజలకు ద్రోహం చేయడం దురదృష్ట కరమన్నారు. తప్పు చేయడం మానవ సహజమని, సరిదిద్దు కోవడం విజ్ఞుల లక్షణమన్నారు. రాజధాని మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తులసిరెడ్డి కోరారు.


వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు



అల్పాహారం అందిస్తున్న దాతలు

ప్రొద్దుటూరు సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వారి ఆద్వర్యంలో జమ్మలమడుగు మండలం పి.సుగమంచిపల్లి వాసి ఒంటిద్దు రామసుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం వారి కూతురు, అల్లుడు ఎన్ఆర్ఐ వి.రామక్రిష్ణారెడ్డి సహకారంతో అవదూత కాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారిని తప్పక ఆదరించాలన్నారు. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ప్రతి మనిషి జీవితంలో తప్పనిసరి అని తెలిపారు. బాల్యం నుంచి పిల్లలకు తల్లిదండ్రుల పట్ల బాధ్యతలను నేర్పాలన్నారు. ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్యను అభినందించారు. కార్యక్రమంలో ఒంటిద్దు సుదర్శన్‌రెడ్డి, చెన్నమ్మ, చంద్రఓబుళరెడ్డి, రమణమ్మ, గంగాభవాని పాల్గొన్నారు.



బొమ్మిశెట్టి రమేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

రచయిత బొమ్మిశెట్టికి ఘన సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు పట్టణానికి చెందిన 'వన్నూరమ్మ' ఎదురులేని పాలెగత్తె పుస్తక రచయిత బొమ్మిశెట్టి రమేష్‌ను అనంతపురం పట్రా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రుద్రంపేట యాదవ కళ్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. అనంతపురం పట్రా కులస్తుల సమ్మేళనం-భవిష్యత్తు కార్యాచరణ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎదురులేని పాలెగత్తె పుస్తకం అత్యంత ప్రజాదరణ పొందిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా వన్నూరమ్మ ఎవరు అని ఇంటర్నెట్లో వెతుకుతున్నారని రచయిత తెలిపారు. సన్మాన కార్యక్రమంలో పట్రా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతు హనుమంత నాయుడు, సలహాదారుడు పెద్దపోతు ఆంజనేయులు, బ్రహ్మంగారిమఠం వైస్ ఎంపిపి రాజశేఖర్ నాయుడు, ఎంబిసి డైరెక్టర్ నాయిని రమేష్ నాయుడు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్గనైజర్ తలుపుల శ్రీనివాస నాయుడు, హైదరాబాద్ మంచాల వెంకటేష్, నాగార్జున పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగు పడి వీరభద్రాపురం గ్రామానికి చెందిన రైతు రవికుమార్‌రెడ్డికి చెందిన పాడి గేదె మృతి చెందింది. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

క్రైం కార్నర్

మామపై అల్లుడు కత్తితో దాడి

ప్రజాశక్తి - వేంపల్లె



కత్తి పోట్లుకు గురైన రామ్మోహన్

వేంపల్లెలోని పుల్లయ్య తోట వీధిలో ఆది వారం మామపై అల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన జరి గింది. బాధిత బంధవులు వివరాల మేరకు.. వేం పల్లెలో నివాసం ఉంటున్న వీరాం జనేయ చెల్లెలు మరొకరితో వెళ్లిపోవడంతో దానికి కారణం మామ రామ్మోహన్ అని అల్లుడు వీరాంజనేయులు అనుమానం పెంచుకున్నట్లు తెలిపారు. అప్పుడప్పుడూ ఇరువురికి వాదోపవాదాలు కూడా జరుగుతున్నట్లు తెలిసింది. మనస్సులో పెట్టుకున్న వీరాంజనేయులు పుల్లయ్య తోటలో ఉన్న మామ రామ్మోహన్‌పై కత్తితో దాడి చేయడంతో రక్త గాయాలైనట్లు బాధితుడి భార్య పార్వతి చెప్పారు. గాయపడిన రామ్మోహన్‌ను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందు తున్న రామ్మోహన్‌ను సిఐ చాంద్‌బాషా ఘటనపై అడిగి తెలుసుకున్నారు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.